## ధాన్యం కొనండి.. రైతులను ఆదుకోండి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ నియోజకవర్గంలో "రైతు గోస – బీజేపీ భరోసా" కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచందర్ రావు, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ పర్యటించారు. షామీర్పేట్ లో ఏనుగు సుదర్శన్ రెడ్డి నేతలకు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఏనుగు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రైతులు వరి ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత ఇవ్వాలి



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్: రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకం అమలుపై వెంటనే స్పష్టత ఇవ్వాలని జనసేన నాయకుడు రవి రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 27 నుంచి విద్యార్థుల కౌన్సెలింగ్ నిర్వహించడం సరైన నిర్ణయం కాదని, పాత విధానం ప్రకారమే పూర్తి స్థాయిలో ఫీజు రీయింబర్స్మెంట్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన తర్వాతే కౌన్సెలింగ్ చేపట్టాలని ఆయన కోరారు. గత నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాయని రవి రాజ్ రాథోడ్ విమర్శించారు.

## కోరుట్ల వార్తలు టూకీగా




**కరపత్రం ప్రతినిధి కోరుట్ల**
తిరుపతికి ప్రత్యేక రైళ్లు జల్నా – తిరుపతి మధ్య (రైలు నంబర్లు: 07814, 07815) నడిచే ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు కోరుట్ల మీదుగా రాకపోకలు సాగిస్తోంది. ఈ సేవలు జూన్ నెలలో 4 ట్రిప్పుల పాటు అందుబాటులో ఉంటాయి.
రాత్రి వేళల్లో గస్తీ జగిత్యాల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కోరుట్ల, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో పోలీసులు రాత్రి వేళల్లో ఆకస్మిక తనిఖీలు, పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచారు.
అభివృద్ధి పనులు
కోరుట్ల మండలంలోని జోగినిపల్లి తదితర గ్రామాల్లో రహదారులు, బీటీ రోడ్ల నిర్మాణాల కోసం స్థానిక ప్రజల నుండి డిమాండ్లు వస్తున్నాయి.
రవాణా సౌకర్యం
కోరుట్ల డిపో పరిధిలో కొత్తగా ఒడ్యాడ్ బస్సు సర్వీసులను కూడా అధికారులు ప్రారంభించారు

## మంత్రి జూపల్లి ఆదేశాలతో అన్‌లోడింగ్ సమస్య

### మండిపడ్డ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్ రెడ్డి

మంత్రి జూపల్లి ఆదేశాలకు భయపడి అధికారులు నాగర్ కర్నూల్ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మాజీ శాసన సభ్యులు మర్రి జనార్దన్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం తాడూర్ మండలం పరిధిలోని ఇంద్రకల్ గ్రామ శివారులోని మణికంఠ కాటన్ మిల్లు గోదాం దగ్గర మొక్కజొన్న, ధాన్యం బస్తాల లోడింగ్, అన్ లోడింగ్,పరిస్థితిని ఆయన తనిఖీ చేశారు. రైతులు ఎదుర్కొంటున్న అన్‌లోడింగ్ సమస్యను తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నేరుగా గోదాంకు వెళ్లి రైతుల ధాన్యాన్ని అన్‌లోడింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గానికి సంబంధించిన మొక్కజొన్న ధాన్యం అన్‌లోడ్ చేయకుండా కేవలం మంత్రి జూపల్లి ఆదేశాలతో కొల్లాపూర్‌కు చెందిన దళారుల ధాన్యాన్ని అన్‌లోడ్ చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కొల్లాపూర్‌కు చెందిన 30 లారీల ధాన్యం అన్‌లోడ్ చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దళారుల వ్యవస్థకు మద్దతిస్తుందని తెలిపారు. రైతుల పంటను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల వివక్షత చూపితే పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. గోదాం వద్ద ఉన్న రైతులకు, డ్రైవర్స్‌కు స్వయంగా భోజనం తెప్పించి పెట్టారు. ఆయన వెంట పలువురు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో ఈ వారం వార్తలు టూకీగా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

» ఏసీబీ దాడుల కలకలం
» శామీర్‌పేట్ ఎమ్మార్వో అరెస్ట్
శామీర్‌పేట్ తహసీల్దార్ (MRO) సుచరిత ఒక భూమి వ్యవహారంలో ఒక బాధితుడి నుండి భారీ మొత్తంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు.
» డిప్యూటీ కలెక్టర్ ఇళ్లలో సోదాలు
మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా డిప్యూటీ కలెక్టర్ (RDO) కె. వంశీమోహన్‌పై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదైంది. ఆయనకు చెందిన పలు ప్రాంతాల్లోని నివాసాలపై ఏసీబీ అధికారులు ఏకకాలంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.
భద్రత ౚ తీవ్రవాద లింకుల కలకలం
» ఐఎస్ఐ (ISI) అనుమానితుడి అరెస్ట్




మేడ్చల్‌లోని ఒక హోటల్‌లో సర్వర్‌గా పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన జాయేద్ ఖాన్ అనే యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పాకిస్తాన్ ఐఎస్ఐ (ISI) మద్దతు ఉన్న ఉగ్రవాద ముఠాతో సంబంధాలు పెట్టుకోవడానికి ప్రయత్నించినట్లు, కొందరు వీవీఐపీల సమాచారాన్ని చేరవేసినట్లు విచారణలో తేలింది. అతడి నుంచి నకిలీ తుపాకులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.
స్థానిక నేరాలు ౚ ఇతర వార్తలు
» జీడిమెట్లలో దారుణ హత్య
జీడిమెట్ల పరిధిలోని చింతల్ అంబేద్కర్‌నగర్‌లో అరుణ అనే మహిళ తన కొడుకు సాయిరత్నంతో కలిసి, పదేళ్లుగా తనతో సహజీవనం చేస్తున్న శివారెడ్డి అనే వ్యక్తిని గొంతుకోసి హత్య చేసింది. అర్ధరాత్రి మృతదేహాన్ని సంచిలో మూటకట్టి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.
» గుడిలో హుండీ చోరీ
సూరారం పరిధిలోని శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో దుండగులు హుండీని ఎత్తుకెళ్లారు. నగదు దోచుకుని, ఖాళీ హుండీని సమీపంలోని అడవిలో పడేశారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.
» డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ఆందోళన
సిద్దాపూర్ పరిధిలో ఉపాధి కోసం ఇచ్చిన భూముల్లో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి వ్యతిరేకంగా స్థానిక ప్రజలు, వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.

# ఏసీబీకి చిక్కిన శామీర్‌పేట్ ఎమ్మార్వో సుచరిత

### » 20 లక్షల లావాదేవీల పై ఆరా

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ
..ఏసీబి అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి.
మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని శామీర్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు నిర్వహించిన ఆకస్మిక దాడులు రెవెన్యూ వర్గాల్లో తీవ్ర కలకలం రేపాయి. ఎమ్మార్వో సుచరితకు సంబంధించిన ఒక వ్యవహారంలో ఆమె డ్రైవర్ బాధితుడి నుండి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకుని,




వాటిని సుచరితకు అందిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు పక్కా సమాచారంతో దాడి చేసి వారిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కార్యాలయంలో జరిగిన సుమారు రూ. 20 లక్షల భారీ లావాదేవీలకు సంబంధించిన కేసులో ఈ దాడులు జరిగినట్లు తెలుస్తోంది. ఈ భారీ మొత్తాన్ని దేనికోసం డిమాండ్ చేశారు, దీని వెనుక ఉన్న అసలు వివాదం ఏమిటనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు.
ప్రస్తుతం ఎమ్మార్వో సుచరితతో పాటు ఆమె డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకుని కార్యాలయంలోనే సుదీర్ఘంగా విచారిస్తున్నారు. ఆ రూ. 20 లక్షల నగదుకు సంబంధించిన ఆధారాలను, ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ ఆకస్మిక దాడుల నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఈ భారీ లావాదేవీల కేసులో ఎమ్మార్వో పాత్రపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, విచారణ అనంతరం మరిన్ని విషయాలు వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

**కరపత్రం ప్రతినిది జమ్మికుంట । మే 26**
జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డును కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం మంగళవారం సందర్శించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.
మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించిన సీపీ, రైతుల నుంచి వివరాలు తెలుసుకుని సమస్యలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక అధికారులు, మార్కెట్ కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి కొనుగోళ్ల నిర్వహణ తీరుపై సమీక్షించారు.
ఈ సమావేశంలో మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, తహశీల్దార్ (ఎమ్మార్వో) నల్ల వెంకట్ రెడ్డి, జమ్మికుంట టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వెంకట్ తదితరులతో కలిసి కొనుగోలు కేంద్రాల నిర్వహణ, రైతులకు అందుతున్న సేవలపై చర్చించారు.
ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ రైతులు





ఎంతో శ్రమించి పండించిన ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చిన తర్వాత ఇబ్బందులు ఎదురుకాకుండా చూడడం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. రైతులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితులు లేకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.
అలాగే పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, పౌరసరఫరాల (సివిల్ సప్లైస్) శాఖలు సమన్వయంతో పనిచేస్తే మాత్రమే కొనుగోళ్లు సమర్థవంతంగా సాగుతాయని చెప్పారు. మార్కెట్ యార్డులో శాంతిభద్రతలకు భంగం కలగకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.
రైతులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, నీడ సౌకర్యాలు, ధాన్యం తూకాలు, రవాణా వంటి అంశాల్లో కూడా ఎటువంటి లోపాలు ఉండకూడదని అధికారులకు సూచించారు. రైతులు సంతృప్తి చెందే విధంగా కొనుగోలు కేంద్రాల పనితీరు ఉండాలని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, వెంకట్, ఆర్ఐ గడ్డం శంకర్, ఇతర శాఖల అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం.. చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ గౌష్ ఆలం -- అక్రమాలకు అడ్డుకట్టే లక్ష్యంగా కఠిన ఆదేశాలు

**కరపత్రం ప్రతినిది, జమ్మికుంట, మే 26:**
జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై పూర్తి స్థాయిలో నియంత్రణ సాధించేందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ) గౌష్ ఆలం మంగళవారం జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల పలు ప్రాంతాల్లో అక్రమ రవాణా అంశాలు చర్చనీయాంశంగా మారుతున్న నేపథ్యంలో పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా తెలుసుకునేందుకు సీపీ తనిఖీలు నిర్వహించారు.
జమ్మికుంట పరిధిలోని నాగంపేట, కోరపల్లి గ్రామ శివార్లలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను సందర్శించిన సీపీ, అక్కడ విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది పనితీరు, తనిఖీ విధానాలు, రికార్డుల నిర్వహణ, భద్రతా చర్యలను సమీక్షించారు. చెక్‌పోస్టుల వద్ద నిలిపివేస్తున్న వాహనాల వివరాలు, వాటి రవాణా అనుమతులు, వాహనాల తనిఖీ ప్రక్రియ ఎలా జరుగుతోందనే అంశాలను నేరుగా పరిశీలించారు.
సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ జిల్లాలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఇసుక అక్రమ రవాణాను సహించేది లేదని స్పష్టం చేశారు. సహజ వనరుల పరిరక్షణతో పాటు ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరగకుండా చూడడం పోలీస్ శాఖ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా ఇసుక తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఇసుక అక్రమ రవాణా సాధారణ చట్ట ఉల్లంఘన మాత్రమే కాదని, అది ప్రభుత్వానికి భారీ ఆదాయ నష్టం కలిగించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతపై కూడా ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో అధికంగా ఇసుక తవ్వకాలు జరగడం వల్ల భూగర్భ జలాల స్థాయి తగ్గే ప్రమాదం ఉందని, ప్రకృతి సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు.
విధుల్లో ఉన్న సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. ముఖ్యంగా చెక్‌పోస్టుల వద్దుగా వెళ్లే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ఎలాంటి ఒత్తిళ్లు లేదా ప్రభావాలకు లోనుకాకుండా నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాలని ఆదేశించారు. అనుమానాస్పద వాహనాలను వదిలేయకుండా వాటి పత్రాలు, రవాణా అనుమతులు, లోడింగ్ వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు.
కొంతమంది అక్రమ రవాణాదారులు ప్రధాన రహదారులను తప్పించి గ్రామీణ ప్రాంతాలు, అంతర్గత రోడ్లు, రాత్రి వేళలను ఉపయోగించుకునే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటూ అలాంటి మార్గాలపై కూడా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్‌ను మరింత పెంచి అనుమానాస్పద కదలికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది ఎటువంటి నిర్లక్ష్యం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించడం, అక్రమ రవాణాపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి అంశాలను సహించబోమని హెచ్చరించారు. ప్రతి పోలీస్ అధికారి తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. పోలీస్ శాఖ మాత్రమే కాకుండా ప్రజలు కూడా చట్టవ్యతిరేక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని సీపీ కోరారు. తమ ప్రాంతాల్లో ఎక్కడైనా అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల సహకారం ఉంటే అక్రమ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా అరికట్టవచ్చని అభిప్రాయపడ్డారు.
ఈ తనిఖీల్లో జమ్మికుంట టౌన్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, రూరల్ ఇన్స్పెక్టర్ వెంకట్ గౌడ్‌తో పాటు స్థానిక పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

